


# అమెరికులాసా కథ – 208

## ఐదవ జులపాల కథ – 1

ఉపోద్ఘాతం:

నిజానికి ఇది జులపాలకి సంబంధించిన కథ కాదు కానీ....మొన్నీ మధ్య ఇండియా వెళ్ళడానికి ముందు.. .అమెరికాలో ఆరు వారాలు జుట్టు పెంచేసుకుని కాకినాడలో దిగగానే క్షవరం చేయించుకుంటే 'సగం విమానం ఖర్చులు' కలిసొస్తాయ్ అంటూ మా క్వీన్ విక్టోరియా వెటకారంగా నిర్దేశించింది కదా. ఆవిడ లెక్కలు ఆవిడవీ మరి! ఎలాగా నలభై ఎనిమిదేళ్ళగా మాంచి ప్రాక్టీస్ ఉన్న భార్యా విధేయుడని కాబట్టి అలా ఆరు వారాలు పెరిగిన పెద్ద జులపాలతో కాకినాడలో దిగాను. దిగీదిగగానే మా ఇంటికే వచ్చి అడకత్తెర వేసే మా ఆస్థాన మంగలి ప్రొ. వీర్రాజుకి కబురుపెట్టాను. అయితే వాడు ఎప్పటిలాగా ఎన్నారై సలామ్ మీద సలామ్ కొడితే కొట్టాడు కానీ ఐదు వందలరూపాయలు ప్లస్ 27 % GST కే కత్తిరించును, మసాజ్ కూడా చేయును కానీ జుట్టుకి రంగు వేయడుట. అదే అమెరికాలో అయితే కలర్ తో సహా నలభై డాలర్లు...అనగా సుమారు మూడు వేల రూపాయలు...GST లేదు...అనగా...వీర్రాజు కలర్ లెస్ షేవింగ్ లో సుమారు రెండు వేల రూపాయల పైగా సేవింగ్ ..కదా...కేలుక్యులేషన్ బాగానే ఉన్నా మా క్వీన్ విక్టోరియా మొహం అదోలా పెట్టి 'అసలే అంతంత మాత్రం. ఇక రంగు కూడా వేయించుకోని తెల్ల జుట్టు రాజుతో కాపురం ఎలా?" అని గింజుకోవడం మొదలు పెట్టింది. అది చూసి, నేను ఆవిడ కాపురం, తద్వారా నా కాపురం కూడా నిలబెట్టుకునే సదుద్దేశ్యం తో, ఆవిడకి తెలీకుండా బయటకి జారుకుని, టోనీ అండ్ ద గై అనే అద్దాల అంతర్జాతీయ సెలూన్ లో ఇంచుమించు లలితా జ్యూయలర్స్ గుండు బాస్ లాగా గీయించేసుకుని మూడు వేల రూపాయల క్షవరం చేయించేసుకున్నాను. అమెరికాలో షేవింగ్ కంటే ఇండియాలో అదే షేవింగ్ తో ఐదు వందల రూపాయల సేవింగ్ చేశాను కదా...మరి ఆవిడ కోరిక కొంచెమైనా తీరినట్టే కదా!

ఇక టోనీ & ద గై లో సంభాషణ కాకినాడలో అన్ని చోట్లలాగానే ఆంధ్రా ఇంగ్లీషులోనే జరిగింది. సదరు టోనీ గారు చూడ్డానికి, వినడానికి మలయాళీ పిల్ల వలె ఉండెను. ఇక నాకు సర్వీస్ చేసిన ఆ రెండో గుండు బాసు 'ద గై'

గాడు చెవుల్లో...అంటే నావి కాదు... తన సొంత చెవుల్లో సెల్ ఫోను వైర్లు పెట్టుకుని ఆ అమెరికనైజ్డ్ తెలుగు రాప్ పాటలకి విసురుగా తల ఊపి అవతల పారేస్తూ..నా తల కాదు...తన సొంత తలకాయే....ఊపుతూ తెగ ఫీల్ అయిపోతూ మొత్తానికి జులపాల కత్తిరింపూ, మంగళ స్నానాలూ చేయించి, చెవుల్లోంచి వైర్లు తీసేసి సర్వీస్ పూర్తి అయినట్టు ప్రకటించాడు. ఆ ప్రకటన సమయం లో నేను ఒక స్వవిషయాన్ని మళ్ళీ గమనించాను.

మళ్ళీ..అంటే....నిజానికి ఆ విషయం అమెరికాలో బయలు దేరే ముందే గమనించాను...ఎప్పుడంటే..విమానం ఎక్కే ముందు ఇండియా వెళ్తున్నాం కదా, దర్జాగా సూటూ, బూటూ వేసుకుందాం అనుకుని, బూటు కంటే ముందు పాద తొడుగులు...అనగా.. సాక్స్ వేసుకోక పోతే విమానం ఎక్కనివ్వరేమో అని అనుకుని ఆ ప్రయత్నం చేసేటప్పుడే నా అమెరికాలి గోళ్ళకి ఆ చైనా సాక్స్ గుచ్చుకు పోయి అక్కడే అతుక్కుపోయాయి. వాటిని ఎలాగో అలాగ ఒక అట్లకాడ, పటకార్ల సాయంతో పీకి అలా అవుటకు కారణభూతులైన ఆ పది కాలిగోళ్ల కేసి తీవ్రంగా వీక్షించగానే ....వాటి సైజు....ముఖ్యంగా ఆ రెండు కాలి బొటన వేళ్ళ గోళ్ళు బాగా పొడుచుకు వచ్చి సుమారు అంగుళన్నర పొడుగ్గా కనపడ్డాయి. నా ప్రమేయం లేకుండా అరిగిన వాటి పురోగతికి ఒక క్షణం ముచ్చట పడ్డాను కానీ కత్తిరించక తప్పదు కదా అనుకుని, మా క్వీన్ విక్టోరియా 'సింగారం సంచీ' లో దాక్కున్న గోళ్ళ కత్తిరింపు పరికరం...అనగా నైల్ కటర్ ని సంపాదించి, కాలి గోరు కత్తిరించుకుందాం అని ఆ కార్యక్రమం మొదలు పెట్టాను. అప్పుడే చిన్న ఇబ్బంది వచ్చింది. అనగా...మధ్యలో చిరు బొజ్జ లాంటి తోలు సంచీ అడ్డువచ్చి, ఎంత ప్రయత్నించినా నేను పూర్తిగా వంగ లేక, మింగ లేక, కక్క లేక...ఆ నైల్ కటర్ గోళ్ళ దాకా తీసుకెళ్ళ లేకా "ఇండియా వెళ్ళాక చూసుకోవచ్చు లే" అని ఆ గోళ్ళని అలాగే వదిలేసి చెప్పులు వేసుకుని విమానం ఎక్కేశాను. ఎయిర్ హోస్టెస్ అమ్మాయిలు, అబ్బాయిలు అస్తమానూ నన్ను పై నుంచి కింద దాకా పదే పదే చూడడం గమనించి ఆ బ్రిటిష్ ఎయిర్వేస్ విమానం వారి జనతా క్లాస్ లో చెప్పులతో ప్రయాణం చేసిన మగ మహారాజుని బహుశా నేను ఒక్కడినే అని అనుమానం వచ్చేసింది.

ఇప్పుడేమో...నాకు తలస్నానం చేయించడానికి సింక్ కుర్చీలో నా శాల్తీని అడ్డంగా పడుకోబెట్టినప్పుడు నా సాక్స్ లో అతుకున్న, నేను వంగ లేక కత్తిరించ లేక పోయిన నా అమెరికాలిగోళ్ళు మళ్ళీ కనపడ్డాయి. అంతా అయాక దగ్గై గాడు నా చేతిలో మూడు వేల రూపాయలు ప్లస్ 27% GST బిల్లు చేతిలో పెట్టగానే, బ్రిలియంట్ అవిడియా వచ్చింది. 'ఏమోయ్, దగ్గై. అన్నట్టూ ఇంకో ఐదొందలూ ప్లస్ 27 % GST బోనస్ ఇస్తాను కానీ నా సింహాచలం లక్ష్మీ నృసింహ స్వామి గోళ్ళలా ఉన్న నా కాలిగోళ్ళు కూడా కత్తిరించి పారేద్దూ" అని నా పవిత్ర పాదాల కేసి చూపించాను. వాడు ఒక వెకిలి నవ్వు నవ్వేసి "మగోళ్ళ గోళ్ళు ఆడోళ్ళే తీస్తారండి. యెంటనే యెంటానాకి ఎల్లండి, పని జరుగుద్ది" అన్నాడు. ఈ ఉవాచ లో మొదటి భాగం..అనగా ఎవరి గోళ్ళు ఎవరు తియ్యాలో అనే బ్రహ్మ సూత్రం, ఆ లింగ భేదం నాకు బాగానే అర్థం అయింది కానీ ఆ రెండోది మాత్రం బుర్రలోకి ఎక్కక, నా ఐదొందలు ప్లస్ 27 % GST రూపాయలూ జేబులో

పెట్టేసుకుని 'యేమా యెంటానా, ఏమా కథ" అని అడిగాను. అతగాడు చెప్పిన వివరాల ప్రకారం..తన టోనీ & గై తలమాసిన వారికి ఏ విధముగా ప్రపంచవ్యాప్తముగా క్షవరము చేయుదురో అదే విధముగా ఆ 'వెంటానా' అనే వారు గోళ్ళ డిపార్ట్మెంట్ లో మేనిక్యూరు, పెడిక్యూరులు చేయుదురు". "ఏమా క్యూరు, ఏమా కథ" అని వివరాలు అడుగుదాం అని క్షణం అనుకున్నా, అమెరికా అహం అడ్డువచ్చి 'ఓస్. అంతేనా?" అనేసి నేను మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించి, బిల్లు కట్టేసి ఇంటికి రాగానే తల కేసి చూసి 'ఎంత తగలేశావ్? అని అడిగింది మా క్వీన్ విక్టోరియా.

ఏ మాటకామాటే చెప్పుకోవాలీ అంటే...ఆ తర్వాత అప్పుడప్పుడు ఏ సోఫా కాళ్లో, రోడ్డు మీద రాయో తగిలినప్పుడు ఆ గోళ్ళు మూకుమ్మడిగా కుయ్యో మని మొరిగినా వాటి మాటే మర్చిపోయి ఇండియాలో ఆరు వారాలూ బిజీగా గడిపేసి, మళ్ళీ హ్యూస్టన్ వచ్చేశాను.

హ్యూస్టన్ వెనక్కి రాగానే, ఆరు వారాలు ఇండియాలో అమెరికాలో చేస్తున్న డైటింగ్ ప్లాన్ మూల పారేసి రోజూ అన్నం, ఆవకాయా, గోంగూరా, పప్పు, పులుసులు, పూత రేకులు, పాలకోవాలతో చేసిన మృష్టాంగ భోజనాలు మనకి చేసిన డయాబెటిక్ డేమేజీ ఎంతో చెక్ చేసుకుందాం అని మా ప్రైమరీ డాక్టర్ కందాళ దగరకి వెళ్ళాను. ఈ మధ్య అమెరికాలో అసలు కళ్ళ డాక్టర్ దగ్గరకి వెళ్ళినా, పళ్ళ డాక్టర్ దగ్గరకి వెళ్ళినా ఏ డాక్టర్ దగ్గరకి వెళ్ళినా, వెళ్ళగానే ఇది వరకటిలాగా స్టెతస్కోప్ పెట్టి గుండె ఎలా కొట్టుకుంటోందో చూడడం మానేసి ముందు మన కాళ్ళు పట్టుకుంటున్నారు అదేమిటో. ఎందుకంటే టా..పేషెంట్ కాళ్ళు ఏమైనా వాచాయా, రక్త ప్రసరణ ఎలా ఉందీ అని ముందు అవి పిసికి చూడాలిట. అలాగే ఇప్పుడు డా. కందాళ "మీ ఇండియా ట్రిప్ ఎలా అయిందీ" అంటూ నా కాళ్ళదాకా తన చేతులతో వెళ్ళి, అక్కడ వాటిని చూసీ చూడగానే నానా కంగాళీ పడిపోయి, రకీమని ఆగిపోయి హాహాకారాలు పెట్టాడు. అంత గొప్ప డాక్టరూ ఇంత గాభరా పడడానికి కారణం అష్టవంకర్లూ తిరిగి ఉన్న నా కాలి గోళ్ళ పరిమాణం మరియు రంగు మార్పిడీ అని అర్థం అయింది. చెప్పొద్దూ, తన అసంకల్పిత హాహాకారాలు అవగానే వెంటనే ఒకడుగు వెనక్కి వేసేసి, నేను వయసులో పెద్ద వాడిని అని అయినా చూడకుండా అడ్డమైన తిట్లూ అన్ని భాషలలోనూ తిట్టిపోసి "వెంటనే వెంటానాకి వెళ్ళండి. అక్కడ మగాళ్ళ గోళ్ళు ఆడోళ్ళు కత్తిరిస్తారు. పని జరుగుతుంది. ఆ తర్వాత కనపడండి " అని కోప్పడ్డాడు డా. కందాళ.

"వెంటానా? అంటే"....అరె...ఈ మాట ఎక్కడో విన్నట్టు ఉందే....అని ఆలోచించగా.. చించగా కాకినాడలో దగ్గై కూడా ఇచ్చిన సలహా కూడా అదే కదా...ఆ వెంటానా ఎక్కడ ఉండును, అసలు అక్కడ ఏమి జరుగును....

ఆ కథ మరొక సారి...

**COMMENTS**